# శత్రువులు

చొప్పదండి సుధాకర్



"ఇక్కడ కూచుందామా...?" శైలజ హిమబిందును అడిగింది.

"ఇంకొంచెం ముందుకెళదాం" పార్కులో దూరంగా, నిర్మానుష్యంగా కనిపిస్తోన్న ఓ మూలకేసి చూస్తూ అంది హిమబిందు.

ఇద్దరూ మరో రెండు నిమిషాలు నడిచి పార్కులో ఓ పక్కగా కూచొన్నారు. శైలు హేండుబ్యాగులోంచి వేరుశనక్కాయల పొట్లం తీసి ముందుపెట్టింది. చెరో రెండుకాయలు తీసి వొలిచి నోట్లో వేసుకొని నింపాదిగా నములుతూ ఒకరి మొహంలోకి ఒకరు చూసుకొని చిన్నగా నవ్వుకొన్నారు.

తర్వాతి రెండు నిమిషాలు కూడా మౌనంగానే గడిచిపోయాయి.

"ఏమంటున్నాడు నీ ప్రియుడు?" శైలజే ముందుగా నోరు విప్పింది.

హేమ చురుగ్గా చూసింది ఆ మాటలకు. ఆ చూపులో అవహేళనకు గురయిన భావమేదో ప్రతిఫలించినట్టనిపించింది శైలజకి. తన మాటకు హిమ బాధపడిందేమోనన్న శంక అసంకల్పితంగానే ఆమెలో పొడసూపింది. వెంటనే తప్పుని సరిదిద్దుకొంటున్నట్టు ఓ పొడినవ్వు నవ్వి "అదేనే! నీ... ఛ...ఛ... మీ... హరి... ఏమంటున్నాడూ?" అంది.

"హు...!" బదులుగా నిర్వేదంగా నిట్టూర్చింది.

శైలుకి కొద్దిగా భయం వేసింది. తాను పొరపాటుగా నోరుజారినందుకు స్నేహితురాలు ఏమైనా హర్ట్ అయిందేమోనని. అయితే ఆ ఆలోచన తాలూకూ ఛాయలేవీ మొహంలో ప్రతిఫలించకుండా జాగ్రత్తపడి కొంతసేపాగి మళ్ళీ సంభాషణ కొనసాగించింది.

కథ

"చెప్పవే? హరిగారు ఏమంటున్నారు?" రెట్టించినట్లు అడిగింది.

హిమబిందు కొద్దిసేపు మౌనాన్నే ఆశ్రయించింది. ఓ నిమిషం గడిచాకా నెమ్మదిగా గొంతువిప్పి "తనతో వచ్చివుండమంటున్నాడు" అంది.

"ఏ హక్కుతోనటా?" ఎగతాళి చేస్తున్నట్టు అంది శైలు.

"ఏ హక్కుతోనయినా సరే! వచ్చెయ్యమంటున్నాడు! ఇంకా సిగ్గొదిలి చెప్పాలంటే నన్నొదిలి ఇహ ఒక్కక్షణం కూడా ఉండలేనంటున్నాడు" తలవొంచుకొని చిన్నగా చెప్పింది.

"ఐతే సమాజం, ఈ కట్టుబాట్లూ అన్నీ ఏమయిపోవాలట! మరీ ముఖ్యంగా అతడి మొదటి భార్యా పిల్లలూ..." ఆగిపోయింది.

"అంతా ఉంటారూ, నువ్వూ ఉంటావూ! అయినా అదంతా నేనెదుర్కోవాల్సిన రిస్క్. నీకెందుకూ అంటున్నాడు"

"ఆహాఁ అయితే ఆవిడ ఒప్పుకోవద్దూ? అయినా ఈ మొగాళ్ళు ఎంత రోగ్‌లే? ఇంత నిస్సిగ్గుగా ఎట్లా అడగగలిగేడూ" శైలు కోపంతో ఊగిపోయింది.

"సిగ్గెందుకూ? నా గురించి అన్ని విషయాలూ నీతో ముందుగానే విన్నవించుకొన్నానుగదా! ఏదైనా దాస్తే సిగ్గుపడాలి! అన్నీ చెప్పాకే నువ్వంటే నాకిష్టమని కూడా చెప్పాను కదా!" అంటున్నాడు.

"చెప్పాడా మరి మొదటే?"

"ఊఁ" హిమ గొంతులో ఏదో తన్మయంలాంటి పరవశం.

"అయితే అతడితో వెళ్ళిపోతావా?" శైలు అమాయకత్వానికి జాలిపడిపోతూ అడిగింది.

"తేల్చుకోలేకపోతున్నానూ" గొంతులో స్పష్టంగా సంశయం.

"ఏమిటీ తేల్చుకొనేది గాడిద గుడ్డు! ఎవడో ఒక అల్లాటప్పాగాడు, నాలుగురోజులు కల్సి మాట్లాడి నువ్వంటే నాకిష్టమని చెప్పగానే వెళ్ళిపోవడమేనా? అదీగాక అతడికి ఇంతకుముందే పెళ్ళయి పిల్లలు కూడా ఉన్నారు కదా! ఆమె బతుకేంకావాలి?"

"ఆమెకు ఏమీకాదూ! నేను సర్దిచెపుతాను" అంటున్నాడు.

"అంతే ఇంప్రెస్ అయిపోయావా?"

"కాదు"

"మరి?"

"నేను ఇంప్రెస్ అయిన అంశం వేరే వుంది"

"ఏమిటో?" శైలు గొంతులో లీలగా వెటకారం.

"ఏది ఎట్లా జరిగినా, నీజీవితం ఇంతకన్నా మెరుగ్గా ఉంటుందని ఛాలెంజ్ చేస్తున్నాను!" నా చేయి అందుకొని భరోసా ఇచ్చాడు. అందుకే కాదనలేకపోయాను"

"పోనీ అవునన్నావా?"

"లేదు... కాదనలేదుగా...!" హిమగొంతులో ఏదో ఆశా ఆరాటం!

శైలు మిత్రురాలికేసి జాలిగా చూసి నిట్టూర్చింది.

నిజమే హిమ ఆశలో కూడా ఒక వాస్తవం ఉంది. హిమబిందు నిజంగా 'హిమబిందే!' అయితే దురదృష్టకరమైన అంశమేమిటంటే నిండా పాతికేళ్ళు నిండకుండానే ఆమె జీవితంలో చీకటి కమ్మేసింది. పెళ్ళయి నాలుగేళ్ళయి

నా నిండకుండానే విధవగా మారిపోయింది. భర్త ఆక్సిడెంట్లో దుర్మరణం చెందగా ఇద్దరు పిల్లల్ని గంపెడు శోకాన్ని నెత్తికెత్తుకొని పుట్టిల్లు చేరింది. కలలో కూడా ఊహించని దుర్భర జీవితాన్ని నెత్తినేసుకొని ఐదేళ్ళుగా జీవచ్ఛ వంలా బతుకీడుస్తోంది. అదంతా ఓ గుండెలు పిండే వ్యథ. నిజానికి ఇప్పటికీ ఆమె వయసు లో పెళ్ళైనాకాని వాళ్ళు ఆమె స్నేహితురాళ్ళే ఉన్నారు.

నిండైన స్త్రీత్వాన్నికూడా పరిపూర్ణంగా సంత రించుకోని లేలేత ప్రాయంలోనే నికృష్టమైన జీవితాన్ని అనుభవించాల్సి రావడం ఎంత విషాదం!

అటువంటి హిమకు శైలు ఒక ప్రైవేట్ స్కూల్లో కొలీగ్! శైలు హిమ అంత అందగత్తె కాకపోయినా ఆకర్షణీయంగానే ఉంటుంది. విశే షమేమిటంటే ఆమె హిమబిందుకన్నా పెద్దద యినా ఇంకా అవివాహితే!

మొదట్లో ఇద్దరూ అపరిచితులే అయినా ఒకే చోట పనిచేయడం వల్ల కొద్దిరోజుల్లోనే ప్రాణ స్నేహితులయిపోయారు. అందుకు ప్రధానకార ణం శైలు వాగ్ధాటియేనంటే అతిశయోక్తి ఏమీ కాదు. శైలు మాట్లాడుతుంటే ఎవరికైనా సరే ఇంకా ఇంకా వినాలనే ఆకర్షణ ఏదో ఎదుటి వారిని కమ్మేస్తుంది. అబద్ధాన్ని సైతం నిజం గా, నిజాన్ని సైతం అబద్ధంగా తిరగేసి చెప్ప గల ధీశాలి!. ఎవరు ఎట్లా ప్రశ్నించినా, ప్రలో భపెట్టినా చివరకు తనమాటే నెగ్గించుకోగల నేర్పరి! ఒక్కమాటలో చెప్పాలంటే మాటల్తో మెస్మరిజమ్ ప్రదర్శించగల విద్య ఏదో ఆమె నేర్చి ఉంటుందేమో అనిపించేలా ఉంటుంది ఆమె మాట తీరు. అందుకే హేమ ఆమె క్లోజ్ ఫ్రెండయిపోయింది. ఇపుడామె వెంట వుంటే హిమకు కొండంత అండ వున్నంత ధీమాగా అనిపిస్తుంటుంది.

శైలు హిమకు ఒక రోల్ మోడల్! తాను ఎట్లా ఉండాలని అంతరంతరాల్లో ఆశిస్తూ బయటకు ఉండలేకపోతోందో ఆ అరుదైన క్యారెక్టర్ శైలు! తాను చేయలేని ధైర్యాన్ని, పొందలేని మన్ననా మర్యాదా, గెలవలేని విజయాలని తెరమీద అవలీలగా ప్రదర్శించే హీరోను వెర్రిగా అభిమా నించే ఓ సగటు ప్రేక్ష కుడి మనస్తత్వం అది! అందుకై హిమ శైలు వీరాభిమానిగా మారి పోయింది. ఇపుడు వాళ్ళ వీధిలో, స్కూల్లో తెలిసిన వారికందరికి శైలు, హిమలంటే ఒకే నాణేనికి రెండు వైపుల వుండే బొమ్మా, బొరు సులు!

"అయితే చివరగా ఏం నిర్ణయం తీసు కొన్నావ్" హిమ ఆలోచనలు భంగపరుస్తూ అడిగింది శైలు. అయితే ఆమె గొంతులో లీల గా ప్రతిధ్వనించిన ఆదుర్దా దాచలేకపోయింది. బహుశ ఆ ఆదుర్దా 'పిచ్చిది దీనికెలా చెప్పాలి?' అని చెప్పలేక లోలోన కొట్టుమిట్టాడిన ఆరాటం తాలూకు ఛాయలు కావొచ్చు. "నువ్వే చెప్ప వే...! నాక యితే పిచ్చిపట్టేలా వుంది" మాట లు ఏరుకొంటున్నట్టు ఆగిఆగి అంది.

హిమకు దుఃఖం తన్నుకొస్తోంది. ఆమె ఎందుకు ఏడుస్తుందో ఆమెకే తెలియడం లేదు. సుమారు నెలకింద మాసినగడ్డంతో బికారిలా వీధిలో తారసపడ్డాడు హరి. వెంటనే తాను చూపు మరల్చుకొని ఆటో పిలిచి పనేమీ లేకున్నా ఓ కిలోమీటర్ ఆబిడ్స్ వైపు వెళ్ళి అక్కడి నుండి మళ్ళీ నడిచి ఇంటికి తిరిగొచ్చింది.

"ఏమీ పిచ్చిపట్టదు! ఈ ప్రేమ వ్యవహారాల న్ని ఇంతేనే పిచ్చిమొద్దు! మరీ ఈ సాధ్యంకాని కేసులకు ఆకర్షణ మెండు. నిన్నటిదాకా ఎవరో తెలియనివారు ఇవాళ పరిచయమౌతారు. ఆ పిదప మనల్ని విపరీతంగా ఆకట్టుకొంటారు. ఆ తెల్లవారో మర్నాడో ఎవరికి ఎవరో తెలి యకుండా విడిపోతారు. అప్పటి నుండి మొద లవుతుంది అసలు మనోవేదన! వాళ్ళ జ్ఞాప కాలతో రోజులు, నెలలు, సంవత్సరాలు బరు వెక్కి పోతాయి. కూచున్నా, నుంచు న్నా నిద్రపోయినా, మెలకువతో ఉన్నా వారిదే ధ్యాస! ఆ బాధ ఎవరితో చెప్పుకోలేం, లోలోన దాచు కోలేం! అంతకన్నా చావు మేలని పిస్తుంది! అట్లా కొన్నాళ్ళూ- ఆ తర్వాతా మెల్లి మెల్లిగా మరుపు ఆవహిస్తుంది. ఏళ్ళు గడిచి పోతాయి. జ్ఞాపకాలు గాయాలుగా మారి పోతాయి. మానిపోతాయి! అదే కాలప్రభావం! అదే జీవితం. మళ్ళీ రొటీన్... మళ్ళీ ఎప్పుడో ఎవరో కలు స్తారు. మనసు రెపరెపలాడు తుంది. మళ్ళీ ప్రేమ, ఆరాటం, ఉత్సుకత మనల్ని తుఫానుల్లా చుట్టేస్తాయి. ఈ తంతు మరికొన్నాళ్ళు. మళ్ళీ దుఃఖం... మళ్ళీ మరుపు ఇదంతా జీవితచక్రం. నచ్చింది దొరక దు... దొరికింది నచ్చదు... వెరసి ఇదొక విష వలయం" జీవితమంతా కాచివడబోసినట్టు చెప్పింది.

ఆమె విషయ పరిజ్ఞానానికి, వాగ్ధాటికి బహుశ నూరోసారి బిత్తరపోయింది హిమబిం దు. అందుకే చాలాసేపు ఏమీ మాట్లాడలేక పోయింది.

"నువ్వు చెప్పింది అక్షరమక్షరం నిజమే శైలూ! ఒక్కమాటలో చెప్పాలంటే ఇదంతా అపోజిట్ సెక్స్ పట్ల కలిగే తాత్కాలిక ఆకర్షణ తప్ప మరొకటి కాదు. అసలయిన ఆకర్షణలూ, ప్రేమలు ఇట్లా వుండవు" ఏదో నిశ్చయానికొచ్చి నట్లు లేచింది.

"ఇంతకు ఆ విషయం ఏంచేశావ్" శైలు కూడా లేచి అంది.

"నువ్వంతగా విశ్లేషించి చెప్పాకా... ఇంకా అనుమానం దేనికి? అతడిని మనసులోంచి తుడిచెయ్యడమే బెటర్! ఒకవేళ ఇప్పటికీ నేనత న్ని గుడ్డిగానమ్మి వెళ్ళాననుకో! నీ ఉపదేశానికీ, నా అవగాహనాశక్తికి అర్థమేముందనీ" కళ్ళలో అప్రయత్నంగా చొప్పిల్లిన నీళ్ళని స్నేహితు రాలు చూడకుండా తుడుచుకుంటూ బదులు చెప్పింది.

"సర్లే ఇక ఆ విషయం మర్చిపో" నడక ప్రారంభిస్తూ అంది శైలు.

ఆ తర్వాత చాలారోజులు వాళ్ళమధ్య తిరిగి హరి ప్రస్తావన రాలేదు. హిమ కొద్దికొద్దిగా కుదుటపడడం శైలు గమనించింది.

** ** **

శీతాకాలం సమీపిస్తున్నట్టు తొందరగా చీకటి పడుతున్న రోజులు సూచిస్తున్నాయ్! అర్థ సంవత్సరం పరీక్షలు నడుస్తున్నాయ్! ఏరోజు పేపర్లు ఆరోజు దిద్దేస్తూ పనివొత్తిడిలో సత మతమవుతున్నారు స్కూలు స్టాఫ్. ఓ మధ్యా హ్నం శైలు మెల్లిగా హిమతో "ఇది విన్నావా?" గుసగుసగా అంది.

"ఏమిటీ...?" హిమ కాజువ ల్‌గా అడిగింది.

"హరి వాళ్ళావిడ పోయిందట"

"వాట్... ఎట్లా...?"

"ఆక్సిడెంటట...! వాళ్ళ చెల్లె పెళ్ళిలో జీపు బోల్తాపడి..."

"ఆఁ... నిజమా..." స్పృహ తప్పిపోతున్నట్టు అంది.

"ఔనే... నాకు వాళ్ళ పక్కింటా విడ చెప్పింది"

హిమకు దుఃఖం తన్నుకొస్తోం ది. ఆమె ఎందుకు ఏడుస్తుందో ఆమెకే తెలియడంలేదు. సుమా రు నెలకింద మాసినగడ్డంతో బికారిలా వీధిలో తారసపడ్డాడు హరి. వెంటనే తాను చూపు మరల్చుకొని ఆటో పిలిచి పనేమీ లేకున్నా ఓ కిలోమీటర్ ఆబిడ్స్ వైపు వెళ్ళి అక్కడి నుండి మళ్ళీ నడిచి ఇంటికి తిరిగొచ్చింది.



"ఎప్పుడు పోయిందట వాళ్ళావిడ" ఆమె ప్రమేయం లేకుండానే పెదాలు ప్రశ్నించాయి.

"సుమారు నెలదాటిందట"

ఔను! సరిగ్గా తనకు కలిసిందప్పుడే, అంతే కాదు ఏదో మాట్లాడాలనుకొన్నట్లు దీనంగా తన అనుమతికోసం ప్రార్థించినట్టు చూసిన ఆ చూపు తనకి ఇంకా... స్పష్టంగా... గుర్తుంది!

"తానే అనవసరంగా బంగారంలాంటి ఆహ్వానాన్ని కాలదన్నుకొందా?" మొదట్లో వేలకొలది న్యూరాన్లు ఏకకాలంలో పనిచేస్తున్న వొత్తిడి!

"వింటున్నావా" శైలు రెట్టించింది.

"ఊc... పాపం" ఏమనాలో తెలియక ఏదో ఒక మాట వొదిలేసింది.

"పాపం ఏంటే? ఈ మగకుక్కల తీరే అంత! ఆవిడపోయి నిండా రెన్నెళ్ళు కూడా కాలేదు. వాళ్ళ దూరపుబంధువుల అమ్మాయినెవర్నో మళ్ళీ పెళ్ళి చేసేసుకున్నాడట" పళ్ళు నూరుతూ కసిగా అంది.

"ఆc..." హిమ చేతిలో పెన్ను జారిపోయింది.

"ఆc... మరీ అంత దిగులుపడి జాలిపడబోకు! ముందు నీ సంగతి ఆలోచించు! అప్పుడు అంతగా నీవెనక పడ్డాడే? ఇప్పుడు నువ్వు గుర్తుకు రాలేదా?" శైలు ఇంకాఇంకా ఏదో అంటూనే వుంది. శాపనార్థాలు పెడుతూనే వుంది.

అయితే హిమకు అవేమీ వినిపించడంలేదు. వింటొన్న ఏ ఒక్క సంఘటన కూడా ఆమె కనీసం కలలో కూడా ఊహించి ఎరగదు.

"ఉండు నేనే వెళ్ళి రేపోమాపో ఓ దులుపు దులిపి వొచ్చేస్తాను" ఖండితంగా అంది శైలు.

"వొద్దొద్దు..." హిమ చప్పున అనేసింది.

"ఎందుకొద్దు? అప్పుడేమో రెండో పెళ్ళాంగానైనా ఉంచుకోవడానికి సిద్ధమేనన్నవాడు, సందర్భం వొచ్చేసరికి ప్లేటు ఫిరాయించేశాడు. నిజంగా ప్రేమే ఉన్నవాడయితే నిన్నే చేసుకొనేవాడుగా" ఇప్పుడు గొప్పగా వాదించాననుకొంది శైలు.

"ఔను ఇందులో అతడి తప్పేం ఉంది? అప్పుడే అతడిని నమ్మి వెళ్ళి వుంటే, ఇప్పుడు తగు స్థానం ఇచ్చి వుండేవాడేమో? మనమే సమయానుకూలంగా లౌక్యం ప్రదర్శిస్తున్నామేమో?" మెల్లిగా అయినా స్థిరంగా, అంతకన్నా గొప్పగా విశ్లేషించింది హిమబిందు.

"అంటే...?" మొదటిసారి శైలు తడబడింది.

"అంటే ఒక కంపెనీలో ఉద్యోగంలో చేరుతున్నామనుకో, ఆ ఉద్యోగం పూర్తి టెంపరరీ అని తెలిసి చేరకుండా వొదిలేసి ఆ తర్వాతెప్పుడో అది గొప్ప కంపెనీగా మారిపోయి స్టాఫంతటికి వేలకువేలు జీతాలిస్తుంటే మన దురదృష్టం అనుకోవాలా? కంపెనీని ఆడిపోసుకోవాలా?"

శైలు ఆలోచనలో పడిపోయింది. ఆమెను హిమ చెప్పిన లాజిక్ కన్నా హిమ ఆలోచించిన కొత్త కోణమే ఆశ్చర్యంలో ముంచెత్తింది.

** ** **

నా అనుమానం ఏమిటంటే నీ మనసుని ఎవరో డిస్టర్బ్ చేశారని! అదే నిజమైతే అంతకన్నా గొప్ప ట్రాజెడీ మరోటి వుండదు. ఒకటిమాత్రం గుర్తుంచుకో మన చుట్టూ ఉండే స్నేహితులు, శ్రేయోభిలాషులు అనబడే ఒకానొక అలగాజనం ఒకోసారి శ్రేయోభిలాషులు కాకపోవచ్చు.

నిన్న హరి కలిశాడు! నాలుగు దులిపేశాను! నీ లాజిక్, గాడిద గుడ్డూ అన్ని మరిచిపోయాననుకో! గురువుగారు తలదించుకొన్నారు" శైలు హిమతో గొప్పగా చెప్పింది.

"నాకు కలిశాడు...!" నిస్తేజంగా అంది హిమ.

"వాట్! ఏమన్నాడు" ఎగ్జయిటింగ్‌గా అంది శైలు.

"హిమ మౌనంగా హేండ్‌బ్యాగులోంచి ఓ ఉత్తరంలాంటి కాగితం తీసిచ్చింది. శైలు ఆత్రుతగా దాన్ని తీసి చదవడం మొదలెట్టింది.

డియర్ హిమా!

నువ్వంటే నాకానాడూ, ఈనాడూ ఒకటే ప్రేమ! అయితే నువ్వే నిర్ణయం తీసుకోవడంలో తొట్రుపాటు ప్రదర్శించావ్! అంతేకాదు కనీసం నన్ను కలవడానికి కూడా ఒక దశలో జంకావ్! బహుశా ఇది నీ సొంత బుద్ధికాకపోవచ్చు. ఎందుకంటే నేనంటే నీకెంత ప్రేమో నీకన్నా ఎక్కువగా నాకే తెలుసు. అయితే నా అనుమానం ఏమిటంటే నీ మనసుని ఎవరో డిస్టర్బ్ చేశారని! అదే నిజమైతే అంతకన్నా గొప్ప ట్రాజెడీ మరోటి వుండదు. ఒకటిమాత్రం గుర్తుంచుకో మనచుట్టూ ఉండే స్నేహితులు, శ్రేయోభిలాషులు అనబడే ఒకానొక అలగాజనం ఒకోసారి శ్రేయోభిలాషులు కాకపోవచ్చు. మనం బాగుపడిపోతామని తెల్సినప్పుడు వాళ్ళు చాలా పాలిష్డ్‌గా కొన్ని కట్టుబాట్లూ, సంప్రదాయాలూ, కొందరు ఓటమి పాలయిన ఘటనలు చెప్పి నిరుత్సాహపరుస్తూ మనల్ని సదరు ప్రయత్నం నుండి విరమింపజేస్తారు. కొన్ని కొన్నిసార్లు వాళ్ళు చేసే ఇటువంటి వ్యూహాలు, ప్రయత్నాలూ మనకు ఎంతో బాగా అనిపిస్తాయి. అయితే వాటి ఫలితం మనకు, చేజారాకగానీ తెలిసిరాదు. కొన్ని కొన్నిసార్లు అసలు తెలిసికూడా రాదు. ఉదాహరణకు నీకో విషయం చెబుతాను. నా ప్రాణస్నేహితుడు చందు నాకు పదేళ్ళ క్రితమే టి.టి.సి.లో సీటొస్తే 'బోడి అదేంట్రా? గల్ఫ్ కంట్రీస్‌కి ఐదేళ్ళు వెళితే టీచర్‌గా సంపాదించే మొత్తం సర్వీస్‌కి రెండింతలు సంపాదించొచ్చు. అసలు ప్రభుత్వోద్యోగం ఎవడు చేస్తాడ్రా పిరికి సన్నాసులు తప్ప!" అంటూ మిస్‌గైడ్ చేసి నన్ను బొంబాయి పంపించి నేను అటు గల్ఫ్ కాకా ఇటు సొంత ఊరుకాకుండా రెంటికి చెడిన రేవడై తిరిగొచ్చేసరికి వాడు మాత్రం టిటిసి పూర్తిచేసి శుభ్రంగా ఉద్యోగం చేసుకొంటున్నాడు. ఫలితంగా వాడి మోసం నాకు అప్పుడు తెలిసివొచ్చినా జీవితంలో ఇక టీచరయ్యే ఆసక్తి అవకాశం మృగ్యమయి చివరికిట్లా ప్రైవేట్ ఉద్యోగాల్లో బతుకు బండ లాగిస్తున్నాను. కాబట్టి తొలుతగా నీకెవరయినా అటువంటి స్నేహితులుగానీ 'శ్రేయోభిలాషులు'గానీ ఉంటే వాళ్ళు నిజానికి మన మిత్రులు కాదు శత్రువులని తెల్సుకో! తెల్సుకొని దూరం చేసుకో, ఆ తర్వాత నీకు సంబంధించిన నిర్ణయాలన్ని నీవే స్వేచ్ఛగా తీసుకో. బాగుపడతావ్!

ఒకవేళ అటువంటి వాళ్ళెవరూ లేకపోతే నా అట్టడుగు స్థాయి ఆలోచనకు పెద్ద మనసుతో క్షమించి వొదిలెయ్! ఇహ ఉంటాను!

మళ్ళీ జన్మంటూ ఉంటే ఈసారయినా భార్యాభర్తలవుదాం!

సెలవ్

నీ హరి

ఉత్తరం పూర్తిచేసిన శైలు మొహం నల్లగా మాడిపోయింది. దాన్ని తిరిగి హిమ చేతిలో పెట్టి తలవొంచుకొని చరచరా అక్కడి నుండి మాయమయిపోయింది.

హిమబిందు మాత్రం శిలాప్రతిమలా అక్కడే నిలబడిపోయింది.

** ** **

ఇదంతా నిన్నటి కథ! ఇవాళ్టి వ్యథేమిటంటే హిమబిందు చచ్చిపోయింది! అదీ ఆత్మహత్య చేసుకొని! ఒకసారి కనిపించని విధిచేతిలో ఓడిపోయి, మరోసారి నిత్యం కనిపించే మిత్రులనబడే శత్రువుల చేతిలో...!

